క్లుప్తంగా

ముగిసిన కనకదుర్గమ్మ ఆలయ వార్షికోత్సవాలు



పెనుగొండ: స్థానిక జడ్డువారి వీధిలో కనకదుర్గమ్మ ఆలయ వార్షికోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. మంగళవారం భారీ అన్న సమారాధనతో ఉత్సవాలు ముగించారు. వారం రోజులుగా కనకదుర్గమ్మ అమ్మవారికి నిత్య పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు కనక దుర్గమ్మ అమ్మవారికి లక్ష మల్లికా పుష్పార్చన, కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం సుమారు ఆరువేల మందికి ఉదయం నుంచి సాయంత్రం వరకూ భారీ అన్నసమారాధన నిర్వహించారు.

గురువులకు పూర్వ విద్యార్థుల సత్కారం



సిద్ధాంతంలో గురువులను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

పెనుగొండ: సిద్ధాంతంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1975–76 పూర్వ విద్యార్థులు ఆనాటి గురువులను ఘనంగా సత్కరించారు. మంగళవారం సిద్ధాంతంలో జరిగిన కార్యక్రమంలో అప్పటి తెలుగు మాస్టర్ గాదే శ్రీరామచంద్రమూర్తి(రాము మాష్టార్)తో పాటు పలువురు ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో ర్యాలీ సాయిబాబు, కలగ గణేష్, జయవరపు నానాజీ, పాతపాటి రామరాజు , పిల్లి విష్ణుమూర్తి, కరీముల్లా షా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేస్తున్న వాకర్స్ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: ప్రతి వ్యక్తీ జీవితానికి చదువే వెలుగునిస్తుందని వాకర్స్ క్లబ్ అధ్యక్షులు తటవర్తి సుధాకరరావు అన్నారు. మంగళవారం స్థానిక 22వ వార్డు స్పెషల్ మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు పీర్ సాహెబ్, మానెం బసవరాజు, పోతుల ఉమాశంకరరావు, బాసిన సత్యనారాయణ పాల్గొన్నారు.

భగవద్గీతపై ప్రచారం



భగవద్గీతపై ప్రచారం చేస్తున్న దృశ్యం

యలమంచిలి: గురు పౌర్ణమి పండుగ సందర్భంగా త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక మామిడి కుదురు కమిటీ సభ్యులు మంగళవారం నేరేడుమిల్లి గ్రామంలో త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ గ్రంథాలపై ప్రచారం చేశారు. గురు పౌర్ణమి పండుగ ఎందుకు శ్రీకృష్ణుడిని మాత్రమే జగద్గురువుగా పూజించాలో వివరించారు. కార్యక్రమంలో త్రైతసిద్ధాంతం ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక మామిడి కుదురు కమిటీ అధ్యక్షుడు, సభ్యులు బండారు సత్యనారాయణ, హనుమంతరావు, బ్రహ్మాజీ, ధర్మతేజ, సుబ్బారావు, శేషు, వెంకటేష్, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

ఆలమూరులో పింఛన్ల పంపిణీ

పెనుమంట్ర: నెలవారీ పింఛన్ల పథకంలో భాగంగా మంగళవారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మండలంలోని ఆలమూరు గ్రామం ఇందిరమ్మ కాలనీలో లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులను పలు విషయాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో పెనుమంట్ర తహసీల్దార్ వై.రవి కుమార్, ఎంపీడీఓ జీఎస్ ప్రభాకర్ రావు, సర్పంచ్ మేడప రెడ్డి వెంకటరమణ, ఎంపీటీసీ సభ్యురాలు పలివెల ఆశాలత తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్ ఫోరం నూతన కార్యవర్గం ఎన్నిక

భీమవరం: పట్టణంలోని సీనియర్ సిటిజన్ ఫోరం ఫర్ బెటర్ సొసైటీ నూతన కార్యవర్గం ఎన్నికైంది. బ్యాంక్ కాలనీలోని శ్రీకృష్ణదేవరాయ సాంస్కృతిక సమితి భవనంలో జరిగిన మహాజనసభలో వ్యవస్థాపక అధ్యక్షుడిగా మెంటే సోమేశ్వరరావు, గౌరవాధ్యక్షుడిగా మేళం దుర్గా ప్రసాద్, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా నల్లం వెంకట కృష్ణ నాగేశ్వరరావు, బోనం పాండురంగారావు, సహాధ్యక్షుడిగా మట్లపూడి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా దాయన చంద్రజీ, పులఖండం కోటేశ్వరరావు, చీమకుర్తి నర్సింహారావు, దిరిసాల సత్యనారాయణమూర్తి, పెన్మత్స రామకృష్ణంరాజు, సయ్యద్ బాజీ ఎన్నికయ్యారు.

ఎక్కడి పనులు అక్కడే గప్‌చుప్

- చెరుకువాడలో పడకేసిన జెడ్పీ పాఠశాల భవన నిర్మాణం



చెరుకువాడలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల



మధ్యలోనే నిలిచిపోయిన అదనపు తరగతి గదుల నిర్మాణం

పెనుగొండ: మండలంలోని చెరుకువాడలోని జిల్లా పరిషత్ పాఠశాల నిర్మాణ పనులు ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్నట్లు తయారైంది. చాలీచాలని తరగతి గదులతో చెరుకువాడ జెడ్పీ పాఠశాలను దశాబ్ద కాలంగా నిర్వహిస్తున్నారు. పెనుగొండలోని ప్రాథమికోన్నత పాఠశాలను జెడ్పీ పాఠశాలగా విస్తరించి, చెరుకువాడ యర్రా నారాయణ స్వామి కాలనీలో అనాటి విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా నిర్మాణం చేశారు. పాఠశాలకు కనీసం ఆట స్థలం లేకుండా పాఠశాల నిర్మాణం చేశారు. కేవలం తరగతి గదుల నిర్మాణానికే ప్రాధాన్యతనిచ్చి పాఠశాల ఏర్పాటు చేశారు. అయితే విద్యార్థుల సంఖ్య పెరగడంతో తరగతి గదుల కొరత ఏర్పడింది. గత కొన్ని సంవత్సరాలుగా పాఠశాల విస్తరణపై వినతలు వెల్లువెత్తాయి. పట్టించుకొన్న నాథుడే కరువయ్యాడు. ఈ తరుణంలో నాడు–నేడుతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో విద్యాభివృద్ధికి ప్రాధన్యతనిచ్చి అభివృద్ధికి శ్రీకారం చుట్టడంతో మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు పాఠశాల అభివృద్ధికి రెండు కోట్లు రూపాయల నిధులు మంజూరు చేయించారు.

నిలిచిపోయిన నిర్మాణ పనులు

జెడ్పీ పాఠశాల సమీపంలోని ఇంటిగ్రేటేడ్ వసతి గృహం నిరుపయోగంగా ఉండడంతో వసతి గృహాన్ని అభివృద్ధి చేసి జెడ్పీ పాఠశాలగా మార్చడానికి ఏర్పాటు చేశారు. దీనిలో భాగంగా 16 తరగతి గదుల నిర్మాణాలు చేపట్టారు. ఎన్నికల ముందు వరకూ నిర్మాణ పనులు నిర్వహించారు. ఎన్నికల అనంతరం నిధుల కొరతతో ఏడాది కాలంగా నిర్మాణ పనులు నిలిపి వేశారు. ఇరుకు గదుల్లోనే తరగతులు నిర్వహిస్తున్నారు. తిరిగి నిర్మాణం చేపట్టాలంటూ పలువురు విజ్ఞప్తి చేసినా ఫలితం లేకుండా పోయింది. ఈ తరుణంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పెనుగొండపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాఠశాల అభివృద్ధికి మొత్తంగా రూ.3.10 కోట్లు నిధులు కేటాయిస్తూ విద్యాశాఖ ద్వారా ఉత్తర్వులు జారీ చేశారు. అయితే నేటి వరకూ ఎక్కడా నిర్మాణం చేపట్టడానికి సన్నాహాలు చేయకపోవడంతో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిధులు మంజూరు అంటూ ఆర్భాటం చేసినా నేటి వరకూ నిర్మాణం ముందుకు సాగక పోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా నిర్మాణం చేపట్టి త్వరగా పూర్తి చేసి పాఠశాలను నూతన భవనం నిర్వహణకు ఏర్పాటు చేయాలంటూ పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

పెయ్య దూడల అభివృద్ధికి కృషి

పెనుగొండ: పాడి రైతుల అభివృద్ధికి పశువుల్లో కృత్రిమ గర్భోత్పత్తి ద్వారా పెయ్య దూడల ఉత్పత్తికి పశు సంవర్ధక శాఖ కృషి చేస్తుందని తాడేపల్లిగూడెం డివిజన్ డెప్యూటీ డైరక్టర్ డాక్టర్ ఎల్‌కే సుధాకర్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఇప్పటి వరకూ రూ. 500 ఉన్న వీర్య నాళికను రూ.150కే అందుబాటులోకి తెచ్చినట్లు వివరించారు. లింగ నిర్ధారిత వీర్యంతో కృత్రిమ సంపర్కం చేసినపుడు 95 శాతం కేవలం పెయ్యదూడలే జన్మిస్తాయని పేర్కొన్నారు. ఈ నెల 6న ప్రపంచ అంటువ్యాధుల నివారణ దినోత్సవం నిర్వహిస్తాని స్పష్టం చేశారు. దీనిలో భాగంగా పెంపుడు కుక్కలకు అన్ని పశువైద్య శాలల్లో ఉచితంగా యాంటి రాబీస్ టీకాలు వేస్తామని తెలిపారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

పాలకొల్లు సెంట్రల్: మండలంలోని శివదేవుని చిక్కాల గ్రామానికి చెందిన ఓ మహిళ అదృశ్యమైనట్లు రూరల్ పోలీసులు తెలిపారు. ఎస్.చిక్కాల గ్రామానికి చెందిన ఎం.పద్మ అనే మహిళ జూన్ 27న బయటకు వెళ్లి వస్తానని చెప్పి మళ్లీ తిరిగి రాలేదని అన్నారు. ఆమె కోసం బంధువులు ఇళ్ల వద్ద గాలించినా ఫలితం లేకపోవడంతో ఆమె భర్త నరసింహారావు మంగళవారం రూరల్ పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు ఎస్సై బి.సురేంద్ర కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మర్యాదపూర్వక కలయిక



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో చినిమిల్లి చందు



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో వేణుమాధవ్ రెడ్డి

మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మంగళవారం తాడేపల్లిలో నరసాపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు చినిమిల్లి చందు, యువజన విభాగం కార్యదర్శి కొవ్వూరి వేణు మాధవరెడ్డి కలిశారు. తాడేపల్లి వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షులతో నిర్వహించిన సమావేశంలో వారు పాల్గొన్నారు.

– నరసాపురం/పెనుమంట్ర

ఘనంగా వైద్యుల దినోత్సవం



డాక్టర్ హెచ్ సత్యనారాయణమూర్తిని సత్కరిస్తున్న కర్రా జయసరిత

పాలకొల్లు సెంట్రల్: డాక్టర్స్ డే సందర్భంగా వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి కర్రా జయసరిత ఆధ్వర్యంలో పట్టణంలో పలువురు వైద్యులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మాజీ శాసనసభ్యుడు డాక్టర్ సీహెచ్ సత్యనారాయణ మూర్తి, డాక్టర్ రాజేంద్రప్రసాద్, డాక్టర్ మల్లుల జ్ఞానేశ్వరిలను సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు జోగాడ ఉమామహేశ్వరరావు, పెచ్చెట్టి కృష్ణాజీ, మామిడిశెట్టి చిట్టిబాబు, దేవ రాజేష్, వీరా మల్లికార్జునుడు తదితరులు పాల్గొన్నారు. స్థానిక జీవీఎస్‌వీఆర్ఎం మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో డాక్టర్స్ డే సందర్భంగా పట్టణ వైద్యులు డాక్టర్ జి.స్వరూప్‌ను విద్యార్థులు సత్కరించారు. డీఎన్నార్ కళాశాలలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించి, 130 మంది విద్యార్థినులకు హర్ష మెడికల్ ల్యాబ్ ఆధ్వర్యంలో 20 రకాల పరీక్షలు నిర్వహించారు. క్లబ్ నూతన అధ్యక్షులు పులకండం కీర్తి చందు రాయుడు, సెక్రటరీ గోటేటి శేషసాయి, ట్రెజరర్ గవర పవన్ నాయుడు, డీఎన్నార్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శోభారాణి పాల్గొన్నారు. స్థానిక లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్స్ డే, చార్టెడ్ అకౌంట్స్ డే కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. స్థానిక రాజవల్లి రాధారమణ లయన్స్ కంటి ఆసుపత్రిలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నరసాపురం డీఎస్పీ జి.శ్రీవేదతో పాటుగా పట్టణంలో ఉన్న 15 మంది వైద్యులను ఒక చార్టెడ్ అకౌంటెంట్‌ను సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు శిడగం సతీష్, ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ యర్రా మాధురి, ఐఎంఏ ప్రెసిడెంట్ ఆర్‌వీ రమణ పాల్గొన్నారు. డాక్టర్స్ డే సందర్భంగా జిల్లా వైద్యశాఖాధికారి డాక్టర్ జి.గీతాబాయిని జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపామని ఎన్జీఓ సభ్యుడు గుడాల హరిబాబు ఏఎస్ఎన్ మూర్తి తదితరులు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న చేగొండి ప్రకాష్



పెనుగొండలో డాక్టర్ కేఆర్ రాజును సత్కరిస్తున్న మానవత

పెనుగొండలో..

పెనుగొండ: జాతీయ వైద్యుల దినోత్సవం పెనుగొండలో మానవత స్వచ్ఛంద సంస్థ, లయన్స్ క్లబ్, భాష్యం పాఠశాలల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయా సంస్థల ఆధ్వర్యంలో మంగళవారం ప్రముఖ వైద్యులు డాక్టర్ కె.రామచంద్ర రాజు, మేడపాటి మురళీ జోగి రెడ్డి, కర్రి భారతి, ఎస్‌వీడీ పవన్‌కుమార్, పులగం కృష్ణ కల్యాణ్‌లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కొమ్ముల రామకృష్ణ, డాక్టర్ నల్లిమిల్లి విజయరాజు, నేమాని శ్రీనివాస్, కర్రి నరేంద్ర రెడ్డి, గాజుల బులి పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ అధ్యాపకుల ఆందోళన



ఆందోళన చేస్తున్న అధ్యాపకులు

నరసాపురం: బీజీబీఎస్ మహిళా కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ వ్యవహారాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కాంట్రాక్ట్ అధ్యాపకులు ఆందోళన కొనసాగిస్తున్నారు. కళాశాలలో అవినీతి వ్యవహారాలు, లైంగిక వేధింపులపై ఫిర్యాదు చేశామనే కక్షతో తమను కళాశాలలోకి రాకుండా నూలి శ్రీనివాస్ అడ్డుకున్నారని ఆరోపిస్తూ మంగళవారం కళాశాల ఎదుట ఆందోళన చేశారు. దీక్ష చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. తమకు రూ.4 వేలు జీతాలే ఇస్తూ రికార్డుల్లో రూ.40 వేలు చూపిస్తున్నారని, అధికారులకు ఫిర్యాదు చేశామన్న కక్షతో బెదిరిస్తున్నారని ఆరోపించారు. తక్షణం కళాశాల వ్యవహారలపై విచారణ చేసి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో కాంట్రాక్ట్ అధ్యాపకులు పి.ఝాన్సీలక్ష్మి, వి.గంగాలక్ష్మి, టీఎల్ఎస్ మనోహరి, ఒ.జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి రాజ్యలక్ష్మి

నరసాపురం: ఈ నెల 5న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో వీలైనన్ని ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా పోలీసు అధికారులు కృషి చేయాలని నరసాపురం జూనియర్ సివిల్‌జడ్జి ఎస్.రాజ్యలక్ష్మి సూచించారు. లోక్ అదాలత్ నిర్వహణపై మంగళవారం కోర్టు హాల్లో ఆమె పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో జడ్జి మాట్లాడుతూ రాజీ చేసుకోదగిన కేసులను గుర్తించి కక్షిదారులకు నోటీసులు ఇచ్చి కౌన్సెలింగ్ ఇవ్వాలని చెప్పారు. కేసులు రాజీ చేసుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించాలని చెప్పారు. రాజీ మార్గమే రాజమర్గమని కక్షిదారుల్లో అవగాహన పెంచాలని చెప్పారు. కేసులు రాజీ చేసుకోవడం ద్వారా సమయం, డబ్బు ఆదా అవుతుందన్నారు. నరసాపురం టౌన్ సీఐ బి.యాదగిరి, ఎస్సై జయలక్ష్మి, మొగల్తూరు ఎస్సై నాగలక్ష్మి, ఏఎస్సై సూర్య భాస్కరరావు పాల్గొన్నారు.

రోటరీకి బెస్ట్ ప్రెసిడెంట్ అవార్డు



బెస్ట్ అవార్డులతో రోటరీ క్లబ్ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఈ సంవత్సరం చేసిన సేవలకు గానూ పాలకొల్లు రోటరీ క్లబ్ అధ్యక్షులు రావాడ సతీష్‌కు బెస్ట్ అధ్యక్ష అవార్డు వచ్చినట్లు క్లబ్ సభ్యులు తెలిపారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ 2024–25 సంవత్సరానికి గానూ రాజమండ్రిలో జరిగిన రోటరీ డిస్ట్రిక్ట్ అవార్డ్స్ కార్యక్రమంలో పాలకొల్లుకు 17 అవార్డులు వచ్చాయని వివరించారు. ముఖ్యంగా పోలియో ఫండ్, ఎండోమెంట్ ఫండ్, డిస్ట్రిక్ట్ కాన్ఫరెన్స్‌లకు హాజలు, పబ్లిక్ ఇమేజ్, హెల్త్ క్యాంప్స్, బేసిక్ ఎడ్యుకేషన్, ఎన్విరాన్మెంట్ ప్రోగ్రామ్, కమ్యూనిటీ సర్వీసెస్ ఇలా వివిధ రకాలు సేవలు అందించినందుకు గాను పాలకొల్లు క్లబ్‌కు 17 అవార్డులు వచ్చాయన్నారు. రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ చేతులమీదుగా ఈ అవార్డులను అందుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు జవ్వాజి కళ్యాణ్, పోతాబత్తుల సత్యనారాయణ, ముత్యాల శ్రీనివాస్, చందక రాము, మద్దాల వాసు, యిమ్మిడి రాజేష్, కావలి నగేష్, మద్దాల రాంప్రసాద్ పాల్గొన్నారు.

తిరుమలలో అలరించిన నాట్య ప్రదర్శనలు



తిరుమలలో కూచిపూడి ప్రదర్శనలు ఇచ్చిన చిన్నారులు

నరసాపురం: తిరుమల ఆస్థాన మండపం శ్రీనివాస కళార్చనలో టీటీడీ, అన్నమయ్య వికాస తరంగిణి సంస్థ (హైదరాబాద్) సంయుక్త ఆధ్వర్యంలో మూడురోజుల పాటు నిర్వహించిన కూచిపూడి కళా ప్రదర్శనల్లో నరసాపురం శ్రీఆదిపరాశక్తి నృత్యనికేతనం విద్యార్థులు అలరించారు. మొత్తం 4 రాష్ట్రాలకు చెందిన కూచిపూడి కళాకారులు పాల్గొన్న ఈ ప్రదర్శనలకు ఉమ్మడి గోదావరి జిల్లాల నుంచి నాట్యారాణి వి.అనంతలక్ష్మీదేవి శిష్యులు 35 మంది ఎంపికై పాల్గొనడం విశేషం. ప్రదర్శనల్లో పాల్గొని వచ్చిన అనంతలక్ష్మీదేవి శిష్య బృందాన్ని నత్యనికేతనం అధ్యక్షుడు కర్నల్ రంగినీడి సుబ్బారావు, ఉపాధ్యక్షుడు ఆర్.సుబ్బారావు, కార్యదర్శి ఆర్.పార్థసారిధి తదితరులు అభినందించారు.

మాయమవుతున్న పుంతలు

- రైతులు, మట్టి మాఫియా చేతుల్లో ఆక్రమణలు, తవ్వకాలు.
- పట్టించుకోని అధికారులు




కలిసిపూడితో భారీగా మట్టి తవ్వేసిన పుంతలు

ఉండి: వ్యవసాయ, రైతు అవసరాల కోసం సుదూర ప్రాంతాల్లోని పొలాల వద్దకు చేరుకునేందుకు, పొలాలు, గ్రామాల మధ్య ఉండేవే ప్రభుత్వ పుంత భూములు. ఈ పుంత భూముల్లోనే రోడ్లు వేసి గ్రామాల మధ్య కనెక్టవిటీ, రైతులు పొలాలకు వెళ్లేందుకు అనువుగా పుంతరోడ్లు వేయడంతో వ్యవసాయ అభివృద్ధి జరుగుతుంది. అలాగే వరికుప్ప నూర్పుల కోసం,వ్యవసాయ ఉత్పత్తుల రవాణా కోసం వినియోగించే ఈ ప్రభుత్వ భూములు (పుంతలు)రాను రాను బక్కచిక్కిపోతున్నాయి. సమీప ప్రాంత రైతులు పుంతలను నెమ్మదినెమ్మదిగా తమ పొల్లాల్లో కలిపేసుకోవడంతో అవి కాస్త తరిగిపోతున్నాయి. ఎవరి పొలం వద్ద వుండే పుంత భూమిని సదురు రైతు ఆక్రమించుకుని కొద్దికొద్దిగా చేనులో కలిపేసుకుంటున్నాడు. గట్టు లంకలు, మెరక తీసే పని చేసిన ప్రతిసారీ, దుక్కుదున్నిన సమయంలోను పుంతలు కరిగిపోతున్నాయి.

పెరుగుతున్న తవ్వకాలు

రైతులను మించి పుంతలను మట్టి అక్రమ రవాణాదారులు ఆక్రమించుకుంటున్నారు. పుంతలను ఇష్టానుసారంగా వాడుకుంటున్నారు. ముఖ్యంగా రైతుల కోసం ఏర్పాటు చేసిన పుంత రహదారులను మట్టి అక్రమ రవాణాదారులు ధ్వంసం చేస్తున్నారు. భారీ వాహనాలతో రాజకీయ పలుకుబడితో మట్టి రవాణా చేస్తున్నారు. ఏ ప్రాంతంలో అయితే పుంత భూములు ఎక్కువగా ఉన్నాయో ఆ ప్రాంతాన్ని మట్టి అక్రమ రవాణాదారులు ఎంచుకుని అక్కడి నుంచి పుంతల మట్టిని కూడా తరలించేస్తున్నారు. పుంతలను తవ్వేయడంతో పాటు వారి ఇష్టానుసారం రహదారుల కోసం పుంతను విడగొట్టేస్తున్నారు. ఇప్పటికే మండల వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో పుంత భూములను ధ్వంసం చేయడంతో పాటు మట్టిని అక్రమంగా తరలించేశారు. పుంత భూములు అన్యాక్రాంతం అవుతున్నా గ్రామ రెవెన్యూ అధికారులు గానీ మండలాధికారులు గానీ అటువైపు కనీసం కన్నెత్తి కూడా చూడటం లేదు. దానికి కారణాలు అనేకం ఉన్నాయి. గ్రామ పరిధిలో పుంత భూములను తవ్వేస్తుంటే సదరు గ్రామ రెవెన్యూ అధికారికి తెలియకుండా ఉంటుందా? అలాగే కళ్లెదుటే పుంత భూముల్లోని మట్టిని అక్రమంగా తవ్వకుపోతుంటే అధికారులకు సమాచారం ఉండదా?అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా మండలస్థాయి అధికారులు ప్రభుత్వ పుంత భూములను రక్షించాలని లేకుంటే భవిష్యత్‌లో పొలాలకు వెళ్లేందుకు దారులు కూడా కనుమరుగవుతాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


పుంత భూములను పరిరక్షించాలి



అధికారుల కళ్లెదుటే ఇదంతా జరుగుతున్నా పట్టించుకోకపోవడం దారుణం. రైతులు వరిచేలల్లో మట్టిని తరలిస్తుంటేనే ఆరా తీసే అధికారులు ప్రభుత్వ భూములు తవ్వేస్తుంటే తెలియకుండాతుంటుందా? మిగిలిన భూములనైనా కాపాడేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి. లేకపోతే రైతుల మధ్య గొవలు తప్పవు.

– బడుగు బాలాజీ, వైఎస్సార్ సీపీ నాయకుడు

వ్యవసాయ అభివృద్ధి కోసమే పుంత భూములు



వ్యవసాయాభివృద్ధి, వ్యవసాయ ఉత్పత్తుల రవాణా, ఎరువులు పొలాలకు చేరవేసేందుకు మినహాయింపు చేసుకున్నవే పుంత భూములు, వాటిని ఎప్పటికే జాగ్రత్తగా కాపాడుకోవాలి. అవి హరించుకుపోయినా, కనుమరుగైపోయినా రైతుల మధ్య కొట్లాటలు, అధికారులకు తలనొప్పులు తప్పవు.

– శేషాద్రి శ్రీనివాస్, వైఎస్సార్‌సీపీ నాయకుడు

కనకాయలంక వంతెన నిర్మాణానికి నిధుల మంజూరు

యలమంచిలి: మండలంలోని కనకాయలంక కాజ్ వే వద్ద హైలెవెల్ ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వం రూ.22.83 కోట్లు మంజూరు చేస్తూ పరిపాలనా ఆమోదం ఇచ్చినట్టు గోదావరి హెడ్ వర్క్స్ డివిజన్ (ధవళేశ్వరం) ఈఈ గంగుమళ్ల శ్రీనివాస్ మంగళవారం విలేకరులకు తెలిపారు. కనకాయలంక, చాకలిపాలెం (వశిష్ట ఎడమ ఏటిగట్టు) గ్రామాలను కలుపుతూ వశిష్ట నదిపై వంతెన నిర్మాణానికి అనుమతి లభించిందన్నారు. టెండర్ల ప్రక్రియ పూర్తయిన తర్వాత పనులు ప్రారంభిస్తామన్నారు. అలాగే మరొక లంక గ్రామమైన పెదలంక వద్ద సింగిల్ రోడ్డు నిర్మాణానికి రూ.80.80 లక్షలు, కంచుస్తంభంపాలెం, యలమంచిలిలంక గ్రామాల మధ్య ఏటిగట్టు మీద రోడ్డు నిర్మాణానికి 2.52 కోట్లు, యలమంచిలి, బాడవ గ్రామాల మధ్య ఏటిగట్టు మీద రోడ్డు నిర్మాణానికి 1.88 కోట్లు మంజూరైనట్లు, టెండర్లు పూర్తయిన తర్వాత ఈ పనులు ప్రారంభిస్తామని ఆయన తెలిపారు.

గెస్ట్ లెక్చరర్ల కోసం దరఖాస్తుల ఆహ్వానం

పాలకొల్లు సెంట్రల్: స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. కామర్స్, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్, కంప్యూటర్ సైన్స్, కెమిస్ట్రీ, ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో నియామకం కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. సంబంధిత సబ్జెక్టుల్లో పీజీ డిగ్రీ కలిగి 55 శాతం లేదా ఆపైన మార్కులు కలిగి ఉన్న అభ్యర్థులు అర్హులని స్పష్టం చేశారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 9 లోపు కళాశాల ఆఫీసులో దరఖాస్తులు అందజేయాలని వివరించారు. జూలై 9న ఉదయం 10 గంటలకు అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు.